రాడార్ కేంద్రం రాకతో జిల్లాకు మహర్దశ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూస్‌టుడే, వికారాబాద్:

'నేవీ రాడార్ కేంద్రాన్ని దామగుండంలో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. తద్వారా ప్రజలకు మేలు చేకూరుతుంది. ఇదే ఉద్దేశంతో పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి దశాబ్దన్నర కాలంగా కేంద్రం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారనీ, ఆ కల నేడు సాకారమైందని' ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పూడూర్ మండలం దామగుండం పరిసర ప్రాంతంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇక్కడ నుంచే రాడార్ ప్రాజెక్టు (వీఎల్ఎఫ్) ఏర్పాటు కావడంతో జిల్లా ప్రాధాన్యతను తెలంగాణ సమాజం గుర్తిస్తుందని ఆయన అన్నారు. ప్రకృతి ప్రేమికులకు ఒక్కటే చెబుతున్నానని.. ప్రాజెక్టును వివాదం చేయడం, లక్షల చెట్లు తొలగిస్తున్నారని ప్రజల్లో అపోహలు సృష్టించడం సరి కాదని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, చేవెళ్ల, మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డి.కె.అరుణ, పరిగి, తాండూర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, యాదయ్యలకు నావికాదళ ప్రధానాధికారి దినేష్ కె త్రిపాఠి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ, జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి

అభివృద్ధికి మైలురాయి: టీఆర్ఆర్


రామ్మోహన్‌రెడ్డి

రాడార్ కేంద్రం ఏర్పాటు చేయడం అభివృద్ధికి మైలురాయిగా మారుతుందని, రానున్న రోజుల్లో జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. రాడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేవీ పాఠశాలల్లో చదివే ఈ ప్రాంత విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని, గతంలో నేవీ పాఠశాలల్లో చదివి ప్రస్తుతం ఉన్నత ఉద్యోగాల్లో కొనసాగుతున్న పలువురి ప్రముఖుల పేర్లను ప్రస్తావించారు. పర్యావరణ పరిరక్షకులు ఎవరైనా తనను కలిస్తే వారిని తన సొంత ఖర్చులతో తమిళనాడులో కొనసాగుతున్న నావి రాడార్ కేంద్రానికి తీసుకెళ్లి అనుమానాలను నివృత్తి చేస్తానని తెలిపారు.

● జ్ఞాపికలను అందించేటప్పుడు వ్యాఖ్యాత.. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి బదులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేరు పిలవడంతో సభలో కలకలం రేగింది. తరువాత పొరపాటు తెలుసుకొని చేవెళ్ల ఎంపీని పిలిచారు.

● మంత్రుల రాక నేపథ్యంలో భద్రత కట్టుదిట్టం చేశారు. పాస్ ఉంటేనే క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. పాసులు లేనివారిని అనుమతించలేదు.


కార్యక్రమంలో పాల్గొన్న నేవీ అధికారులు, స్థానికులు

పదనిసలు..

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఉమారెడ్డి దంపతులు కొడుకు రిత్విక్‌రెడ్డితో కలిసి రెండు గంటలు ముందుగానే సమావేశానికి విచ్చేశారు. ప్రాజెక్టు నమూనాను భార్యకు వివరించి చెప్పడాన్ని పలువురు ఆసక్తిగా గమనించారు.

● వ్యాఖ్యాత కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, బండి సంజయ్ పేర్లు సంబోధించగానే భారత్ మాతాకీ జై అని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిల పేర్లు పలికితే 'జై కాంగ్రెస్' అని సభికులు నినాదాలు చేశారు.

● కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వేదికపై నున్న వారిని పేరుపేరునా పిలిచారు. ఎమ్మెల్సీ విప్ మహేందర్‌రెడ్డి పేరు విస్మరించడంతో అభిమానులు నిరాశ వ్యక్తం చేశారు.

గంట ముందే మారిన రూటు

పూడూరు: రాడార్ కేంద్ర శంకుస్థాపన హాజరయ్యేందుకు కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్ రెడ్డి ఇతర ప్రముఖులు హెలికాప్టర్ ద్వారా చేరుకునే విధంగా మొదట రూపొందించిన పోలీసుల రూట్ మ్యాప్ తరువాత మారింది. మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద దిగాల్సి ఉంది. ఆకాశంలో మబ్బులు, చిరు జల్లుల కారణంగా భద్రతా సిబ్బంది రోడ్డు మార్గానికి మార్చినట్లు 12.20 గంటలకు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. ఎస్పీ నారాయణ రెడ్డి మన్నెగూడకు చేరుకుని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ సిబ్బందిని మోహరించి పర్యవేక్షించారు. బస్సులు ఇతర వాహనాలను నిలిపి వేయించారు. దీంతో మన్నెగూడ కూడలిలో అరగంట పాటు ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. మంత్రుల కాన్వాయ్ 1.20 గంటలకు మన్నెగూడ దాటింది. తరువాత వాహనాలను వదిలిపెట్టారు.


మన్నెగూడ కూడలిలో నిలిపివేసిన వాహనాలు

ఆర్టీసీ ఖజానా.. గలగల!

● పండుగ వేళ ప్రయాణికుల రద్దీతో అదనపు ఆదాయం

న్యూస్‌టుడే, పాత తాండూరు, తాండూరు పట్టణం

దసరా పండగ ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చింది. సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. మహిళా ప్రయాణికులతోపాటు నగదు టికెట్ ప్రయాణికులను కలిపి ఐదు రోజులుగా రెట్టింపు రాబడితో ఆర్టీసీ ఖజాన గలగలలాడింది. గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం బాగుందని అధికారులు పేర్కొంటున్నారు.



జిల్లాలో 240 బస్సులు

జిల్లాలో మూడు డిపోల పరిధిలో 240 ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు ఉన్నాయి. తాండూరులో 96, పరిగిలో 72, వికారాబాద్‌లో 62 బస్సులున్నాయి. మూడు డిపోలు కలిపి ప్రతి రోజు లక్ష కిలోమీటర్ల ప్రయాణం చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. సాధారణ రోజుల్లో తాండూరు డిపోలో రూ.14-15లక్షలు, పరిగి డిపోలో రూ.13-14లక్షలు, వికారాబాద్ డిపోలో రూ.10లక్షల వరకు ప్రయాణికుల నుంచి టికెట్ల ద్వారా వసూలవుతోంది.

ఈనెల 10-14 తేదీల మధ్య డిపోల వారీగా ఆదాయం (రూ.లలో)

తేదీ..	పరిగి	తాండూరు	వికారాబాద్
10	17,82,115	17,68,365	10,96,790
11	18,50,285	17,43,190	9,98,445
12	11,55,791	13,50,665	4,90,460
13	11,04,670	11,77,480	6,40,945
14	23,24,815	23,08,791	14,37,835

ఐదు రోజుల్లో రెట్టింపు ఆదాయం..

దసరా పండగ ఈనెల 12వ తేదీన రాగా.. పాఠశాలలకు సెలవులు రావడంతో 10వ తేదీ నుంచే ప్రయాణికుల రద్దీ పెరిగింది. పండగ అనంతరం ఈనెల 14వ తేదీన పెద్దఎత్తున తిరుగు ప్రయాణం చేయడంతో ఈ ఒక్కరోజే మూడు డిపోలు కలిపి మహిళల సున్నా టికెట్‌తోపాటు నగదు టికెట్ రూపంలో రూ.60,71,441 రాబట్టాయి.

డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఫలితమే

దసరా పండగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లు, కండక్టర్లు సెలవులు తీసుకోకుండా డ్యూటీలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఊరు, కుటుంబ సభ్యులందరితో కలిసి పండగ చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రయాణికులు తరలి వచ్చారు. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్పించాం. డ్రైవర్, కండక్టర్ల కృషి ఫలితమే ఆర్టీసీకి అదనపు ఆదాయం తెచ్చిపెట్టింది. ఇందుకు వారికి అభినందనలు.
– సురేష్‌కుమార్, డిపో మేనేజర్, తాండూరు

బోరు మోటారు.. ఇలాగే ఉంటుంది మరి

వికారాబాద్ మండల పరిధి కొటాలగూడలో తాగు నీటికి ప్రజలు ఓవైపు అవస్థలు పడుతుంటే, మరోవైపు బోరు మోటారు నుంచి 24 గంటలూ నీరంతా వృథాగా పోతోంది. సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసింది కావడం, ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో పూర్తిగా తుప్పు పట్టింది. గంటల తరబడి మోటర్ నడుస్తుండడంతో తరచూ మొరాయిస్తోంది. నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ



నూతన ఉపాధ్యాయుల నియామకం

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఉత్తర్వులు అందుకున్న కొత్త టీచర్లకు మంగళవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, శిక్షణ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి పాల్గొన్నారు. కలెక్టర్ వారినుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కొనసాగింది. ఎస్ఏలు, భాషా పండితులు, పీఈటీలు, పీడీలు, ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించారని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్ తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

చురుగ్గా కస్తూర్బా నిర్మాణాలు

పెద్దేముల్, న్యూస్‌టుడే: మండలంలోని మారేపల్లి గేటు వద్ద గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.2.30 కోట్లతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. పాఠశాలలో పదో తరగతి వరకు ఉండేది. ఇంటర్ వరకు స్థాయి పెంచడంలో గదుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి నిర్మాణ పనులకు జూన్‌లో శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు వేగంగా చేపడుతున్నారు. ప్రయోగశాల సైతం నిర్మించనున్నారు.



కొడంగల్‌కు గురుకులాల తరలింపు

కొడంగల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన గురుకుల పాఠశాలలు, కళాశాలలు గతంలో దూర ప్రాంతంలో కొనసాగుతుండేవి. దీంతో విద్యార్థులకు, తల్లిదండ్రులుకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈ సమస్య పరిష్కరించి స్థానికంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మున్సిపల్ పరిధిలోని కొడంగల్, ఉడిమేశ్వరం గ్రామాల మధ్యలో ఓ ప్రైవేటు భవన నిర్మాణం పూర్తికావడంతో మొయినాబాద్ సమీపంలోని కనకమామిడి గ్రామంలో కొనసాగుతున్న మహాత్మ జ్యోతి బా ఫులే గురుకుల కళాశాలను కొడంగల్‌కు తీసుకు వచ్చారు. అలాగే దౌల్తాబాద్‌కు చెందిన బీసీ గురుకుల పాఠశాల, కళాశాల షాద్‌నగర్‌లో కొనసాగుతుండేది. దసరా సెలవులు ముగియడంతో వీటిని కూడా ఉడిమేశ్వరం సమీపంలోని కొత్త భవనంలోకి తరలించారు. దూరంగా కొనసాగుతున్న నాలుగు గురుకులాల్లో రెండిటిని ఈ నెల 15రోజుల వ్యవధిలో కొడంగల్‌కు తరలించారు. అన్ని గురుకుల పాఠశాలలు ఒకే వేదిక వద్ద ఉండేందుకు ఈ నెల 11న భూమి పూజ నిర్వహించిన విషయం తెలిసిందే. భూమి పూజ చేసిన మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామంలో నిర్మాణ పనులు పూర్తి కాగానే సొంత భవనాల్లో ఏర్పాటవుతాయని అధికారులు వెల్లడించారు.


కొడంగల్‌లో అద్దె భవనంలో ఏర్పాటుచేసిన గురుకుల పాఠశాల, కళాశాలలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

పరిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వంలో ఆర్టీసీ సంస్థను విలీనం చేసేందుకు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర టీజేఎంయూ ప్రధాన కార్యదర్శి, వికారాబాద్ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.హనుమంతు కోరారు. మంగళవారం నగరంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హామీ నెరవేరకపోవడంతో ఉద్యోగులు నిరాశకు గురవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు క్రిష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న హనుమంతు

చావు.. వాగు.. ఒకేసారి రావొద్దని కోరుకోవాల్సిందే?

మరణించిన వారి అంత్యక్రియలు ఉన్నంతలో ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తుంటారు. పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లి ఎస్సీవాడ వాసులు మాత్రం తమ ఊళ్లో చావు, వాగు ఒకసారి రావొద్దని దేవుణ్ని ప్రార్థిస్తారు. కారణం నీళ్లలో నుంచి శ్మశానవాటికకు వెళ్లాల్సిన దుస్థితి. వాగు వరకు సిమెంటు రోడ్డు నిర్మించుకున్నా.. పైన వంతెన నిర్మించకపోవడం వల్లే ఈ పరిస్థితి అని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దేముల్



ఇది నిర్బంధ పాలన: భారాస

వికారాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్బంధ పాలన కొనసాగుతోందని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. మంగళవారం దామగుండం అటవీ ప్రాంతంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి నేవీ రాడర్ కేంద్రం శంకుస్థాపనకు వస్తున్న సందర్భంగా చుట్టు పక్కల ఉన్న తండాలు, గ్రామాల ప్రజలు బయటకు వెళ్లకుండా నిర్బంధించారని విమర్శించారు. నియోజకవర్గంలో ఓ వ్యక్తి చనిపోతే చూసేందుకు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వస్తుండటంతో తాను ఇంటి నుంచి బయలు దేరి వెళుతుంటే పోలీసులు వినకుండా అడ్డుకున్నారని అవేదన వ్యక్తం చేశారు.


మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

పంటల నమోదు తప్పనిసరి

దోమ: రైతులు సాగు చేసిన పంటలను ఆన్‌లైన్లో తప్పక నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం దోమ మండలం శివారెడ్డిపల్లి రైతు వేదికను సందర్శించి పంటల నమోదును పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. చీడపీడల గురించి రైతులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్‌రావు, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


పత్తి పంటను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి

767 క్వింటాళ్ల పప్పుధాన్యాల విక్రయం

తాండూరు: తాండూరు వ్యవసాయ విపణిలో రైతులు మంగళవారం 767 క్వింటాళ్ల పప్పు ధాన్యాలను విక్రయించారు. వాటిలో 340 క్వింటాళ్ల మినుములు, సోయాబీన్ 363 క్వింటాళ్లు, పెసలు 64 క్వింటాళ్లు ఉన్నాయి. క్వింటాలు సోయాబీన్‌కు రూ.3,753 నుంచి రూ.4,329, మినుములకు రూ.4,509 నుంచి రూ.8,208, పెసలుకు రూ.7,209 నుంచి రూ.6,507 చొప్పున ధర లభించిందని విపణి కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

దారంతా గుంతలు.. రాకపోకలకు అవస్థలు

మోమిన్‌పేట్ - శంకర్‌పల్లి ప్రధాన రహదారి వర్షాలకు గుంతలు పడిపోయింది. పలుచోట్ల కంకర తేలి రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కొందరు వాహనాన్ని అదుపుచేయలేక కిందపడి గాయాల పాలవుతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.
– ఈనాడు, వికారాబాద్, న్యూస్‌టుడే, మోమిన్‌పేట



భక్తిశ్రద్ధలతో గంధం ఉత్సవాలు


దర్గా వద్ద భక్తులు

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: చంద్రవంచ గేటు వద్ద మహబూబ్‌సుబాన్ల దర్గాలో గంధం ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి గ్రామం నుంచి గంధం ఊరేగింపును దర్గా వద్దకు ఘనంగా నిర్వహించారు. మంగళవారం చంద్రవంచ, కరణ్‌కోట, ఓగీపూర్, గుంతబాస్పల్లి, మిట్టబాస్పల్లి, చిట్టిగణాపూర్, బెల్కటూరు, గోపన్‌పల్లి, గౌతాపూర్‌తో పాటు పట్టణం, సరిహద్దునున్న కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. దర్గా పరిసరాల్లో జాతరను వైభవంగా నిర్వహించారు. ఆట వస్తువులు, తినుబండారాల దుకాణాలు వద్ద కొనుగోళ్లతో సందడి నెలకొంది. నిర్వాహకులు సుదర్శన్‌రెడ్డిపటేల్, రవిశంకర్‌పటేల్, సర్వోత్తమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటాతో బీసీలకు అన్యాయం

తాండూరు: రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా రాష్ట్రాల్లో ఈ కోటాను అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దీన్ని సవరించాలన్నారు.

తరచూ వర్షాలు.. పంటలకు తెగుళ్లు

పిచికారీ మందులు నీటి పాలు

న్యూస్‌టుడే, పెద్దేముల్:

జిల్లాలో రోజూ వానలతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కాకపోయినా వాతావరణం మబ్బుగా ఉండటం, ఉదయం నుంచి ఓ మోస్తరుకు మించి వర్షాలు పడుతున్నాయి. దీంతో పంటలు పాడై పోతున్నాయి. రైతన్న కొలుకోలేక పోతున్నాడు. తెగుళ్ల నివారణకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. ఉదయం మందు పిచికారీ చేసి ఇంటికి రాగానే సాయంత్రం వరకు వానలు పడి శ్రమ అంతా నీటి పాలవుతోంది. లోతట్టు భూముల్లో సాగు చేసిన పంటలు పూర్తిగా పాడైపోయాయి. ఎగువ ప్రాంతాల్లోని పంటలు రోజు కురుస్తున్న వర్షాలకు దెబ్బతింటున్నాయి. పంటలో సగం కూడ చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.


వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

పత్తి రైతులకు తేరుకోలేని దెబ్బ

జిల్లాలోని పరిగి, తాండూరు, కొడంగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో వానా కాలం సాగు కింద వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేశారు. తరచూ కురుస్తున్న వర్షాలు పత్తి రైతులను నష్టాల పాలు చేస్తున్నాయి. జులై మాసంలో విత్తనాలు విత్తిన నాటి నుంచి అవస్థలు తప్పడం లేదు. మొదట్లో వర్షాలు లేక గింజలు సరిగా మొలకెత్తలేదు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో కురుస్తున్న వర్షాలు అతాలకుతలం చేస్తున్నాయి. దసరా పండుగ కాగానే దూది తీత పనులు మొదలు పెడతారు. కానీ వర్షాలకు దూది పూర్తిగా తడిసి పాడైపోతోంది. పంటలను కాపాడుకునే క్రమంలో రైతులు లక్షల రూపాయిలు పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడులు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో సాగు చేసిన పంట పత్తి కావడం విశేషం.


పంట పొలంలో నిలిచిన నీరు

నిలువునా వాడుతున్న కంది

తాండూరు ప్రాంతంలో కంది పంటకు అధిక ప్రాధాన్యం ఉంది. కందితో పాటు అంతర పంటలుగా పెసర, మినుము సాగు చేశారు. వరుస వర్షాలతో ఈ పంటలు బాగా దెబ్బతిన్నాయి. పెసర పంట పూర్తిగా పాడైపోయి గింజ ఇంటికి రాని పరిస్థితి నెలకొంది. ఇక మినుము పంట కల్లాల్లోనే నిల్వ చేసిన చోట దెబ్బతింటోంది. కంది పంట అధిక వర్షాలకు తెగుళ్ల సోకింది. పంటను కాపాడుకునేందుకు రైతులు మందులను పిచికారీ చేసినా వర్షాల పడేసరికి వాన నీటిలో కలిసిపోయాయి. ఎక్కడ చూసినా నీరు నిల్వ ఉండి పంట నిలువునా వాడిపోతోంది. ఎండు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకుందామన్న వానలు అ ఆవకాశం ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. కూరగాయల పంటలపై కూడా వరుస వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. జిల్లాలోని నవాబ్‌పేట, కుల్కచర్ల, మోమిన్‌పేట, ధారూర్, వికారాబాద్, కొడంగల్ తదితర ప్రాంతాల్లో పంటలు పాడైపోయాయి. చేతికి వచ్చే దశలో టమాట పంట బాగా దెబ్బతింది. దీని ప్రభావం వినియోగదారులపై పడింది. రైతులకు నష్టాలు తప్పడంలేదు.

ఐదిళ్లలో చోరీ.. ఆభరణాలు, నగదు మాయం

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని.. ఐదిళ్లలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.50వేల నగదును చోరీ చేశారు. ఈ సంఘటన సుల్తాన్‌పూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. బాధితులు, ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొల్లూరి భారతమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి 6.2 తులాల బంగారు ఆభరణాలు, 3 తులాల వెండి వస్తువులు, గున్నమ్మోల్ల శ్రీనివాస్ ఇంటి తాళాలు బద్దలు కొట్టి 5 తులాల బంగారం, 23 తులాల వెండి, కొత్తూరి శ్రీనివాస్ ఇంట్లోకి చొరబడి 0.9 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, నర్సింలు ఇంటి నుంచి 0.9 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ చేశారు. మరో వ్యక్తి ఇంటి తాళాలు పగుల గొట్టినా.. ఏమీ దొరకక వెళ్లిపోయారు.


అల్మారాలో ఉన్న దుస్తులు పడేసిన దుండగులు

ఉపాధ్యాయపర్వం


చిన్నారిని ఆడిస్తున్న అమ్మమ్మ, వివరాలు రాస్తున్న అమ్మ


భార్య వెళ్లగా కుమారుడిని ఎత్తుకున్న తండ్రి

ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్‌కు కాబోయే టీచర్లు సిద్దిపేట కలెక్టరేట్‌కు మంగళవారం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వందలాది మంది తరలిరావడంతో కార్యాలయంలో సందడి నెలకొంది. మహిళ అభ్యర్థులు తమ వెంట తీసుకొచ్చిన శిశువులను కుటుంబ సభ్యులు ఎత్తుకోగా వారు కార్యాలయంలో వచ్చిన పని చేసుకున్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

ధరఖాస్తుల ఆహ్వానం

దుబ్బాక, న్యూస్‌టుడే: కూడవెల్లి రామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఆలయ ఈవో పి.విశ్వనాథ శర్మ తెలిపారు. ఈ నెల 10న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ కూడవెల్లి ఆలయానికి సంబంధించి ధర్మకర్తల మండలి నియామకానికి ప్రకటన ఉత్తర్వులు వెలువరించారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల్లోపు హైదరాబాద్‌లోని దేవదాయ ధర్మదాయ కమిషనర్‌కు గాని, సంగారెడ్డిలోని సహాయ కమిషనర్‌కు గాని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అన్నదాత ఆవేదన

‘ఫార్మాసిటీ’కి మూడు పంటలు పండించే భూములు సేకరించొద్దని వేడుకోలు


డప్పూర్‌లో ఇటీవల ఆందోళన చేస్తున్న రైతులు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్, న్యాల్‌కల్:

చుట్టూ ఎత్తైన గుట్టలు.. జలపరవళ్లతో వాగులు, చెక్ డ్యాంలు, చెరువులు.. పంటలు పండే భూములు.. జింకలు, నెమళ్లు, వలస పక్షుల సంచారం.. ఉమ్మడి జిల్లాకు తాగునీరందించే మంజీర నది పరీవాహకం ఇది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిన ప్రాంతం ఇది. 2003 ఎకరాల భూసేకరణ చేపట్టాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర సరిహద్దులోని మూడు గ్రామాల ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నారాయణఖేడ్-బీదర్ 161(బి) నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల నుంచి పరిశ్రమల పేరిట స్థలాలు లాగేసుకుంటే ఊరుకోబోమని చెబుతున్నారు.

ఆందోళనలపై నివేదిస్తాం:

–రాజు, ఆర్డీవో, జహీరాబాద్

ఫార్మాసిటీ భూసేకరణ ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు సాగుతుంది. భూములు కోల్పోతున్న రైతులు చేపడుతున్న ఆందోళనలపై ఉన్నతాధికారులకు నివేదించడం జరిగింది.

వాణిజ్య పంటల సాగు

కర్ణాటకలోని బీదర్ జిల్లా కేంద్రానికి సరిహద్దులుగా ఉండే ఈ మూడు గ్రామాల రైతులకు సాగు భూములు జీవనాధారం. చెరుకు, అల్లం, పసుపు, పప్పుదినుసులు, నూనె గింజలు సహా కూరగాయలు, పత్తి ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. కూరగాయలను బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్, హైదరాబాద్‌లకు తరలిస్తారు. నారాయణఖేడ్-బీదర్ 161(బి) జాతీయ రహదారి పనులు ప్రారంభం కావడంతో మార్కెట్‌లో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నాయి. భూమిని సేకరించే ప్రాంతాల్లోని నీటివనరుల ద్వారా మంజీర నదిలోకి నీరు చేరుతుందని.. కలుషితమయ్యే పరిస్థితి తలెత్తుతుందని పర్యావరణ వేత్తలు, జీవవైవిధ్య సంరక్షకులు అంటున్నారు.


సేకరించనున్న చెరువు ప్రాంతం


డప్పూర్, మల్గి శివారుల్లో ప్రతిపాదించిన పట్టా భూములు

ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రణాళిక

• జహీరాబాద్ నిమ్జ్ (జాతీయ ఉత్పాదక పెట్టుబడుల మండలి)కు అనుసంధానం	• సేకరణలో తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని డప్పూర్, మల్గి, వడ్డి గ్రామాలు
భూములు కోల్పోనున్న రైతులు 1,321	మొత్తం ఎకరాలు 2003
పట్టా స్థలాలు 1096.22 ఎకరాలు	అసైన్డ్ భూములు 907.17 ఎకరాలు

సేకరణకు గెజిట్ విడుదల ఆగస్టు 2024

భూమి సేకరించే గ్రామాల పరిధిలో ఉన్నాయివి

చెరువులు	2
వాగులు	5
చెక్ డ్యాంలు	15
బోరుబావులు	150
సాగునీటి బావులు	186

ఫార్మాసిటీ వద్దు.. పైసలు వద్దు



మా ఎకరా భూమి ఫార్మాసిటీకి పోతోంది. ప్రభుత్వం ఇచ్చే ఎంతటి పైసలైనా మాకొద్దు. మా గ్రామాలకు ఫార్మాసిటీ వద్దేవద్దు.

– శశికళ, మహిళ రైతు

పదిహేను ఎకరాలు కోల్పోతున్నాం



ఐదుగురం అన్నదమ్ములం. మా 15 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. మా అందరికీ 30 మంది సంతానం. గుంట భూమైనా మిగలడం లేదు. తర్వాత పరిస్థితి దయనీయంగా తయారవుతుంది. – మల్లప్ప, డప్పూర్

న్యాయ పోరాటం చేస్తాం



మూడు గ్రామాల సారవంతమైన భూములను సేకరిస్తామని ప్రకటించారు. వాటిని నమ్ముకున్న వారి నుంచి బలవంతంగా సేకరిస్తే న్యాయ పోరాటం చేస్తాం.


– రవికుమార్, మాజీ సర్పంచి, డప్పూర్


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

జాతీయ యోగా పోటీలకు ఆకునూరు బాలికలు

చేర్యాల, న్యూస్‌టుడే: సంగారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి చేర్యాల మండలం ఆకునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.సాత్విక, 7వ తరగతి చదువుతున్న పి.అవంతిక జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించి, సన్మానించారు. నవంబరు 8 నుంచి అసోంలోని గౌహతిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.కవిత తెలిపారు. గ్రామానికి చెందిన సందెబోయిన వెంకటేశ్ రూ.8 వేల విలువైన యోగా దుస్తులు విద్యార్థినులకు అందజేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సైదా, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నింగి.. నేల.. ఒకటై..



ఆకాశంలో మేఘాలు పచ్చని పైర్లను, చెట్లను, గుట్టలను తాకే విధంగా ఉండి ఆహా అనేవిధంగా కనువిందు చేస్తోంది. తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ రామప్ప గుడిపై నుంచి కనిపించిన ప్రకృతి రమణీయత చూసేవారిని కట్టిపడేసింది. – న్యూస్‌టుడే, చేగుంట, తూప్రాన్

మళ్లీ వరద... ఆలయం మూసివేత


ఆలయం ముందు ప్రవాహం


రాజగోపురంలో అమ్మవారికి పూజలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు నుంచి నీటిని విడుదల చేయడంతో ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మంగళవారం ప్రవాహం పెరిగింది. తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి మూసివేశారు. రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగించారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

చేగుంట, వెల్దుర్తి: పట్టపగలు ఇంట్లో చోరీ జరిగిందని మాసాయిపేటకు చెందిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మంగళవారం గ్రామానికి వెళ్లి విచారించారు. గ్రామానికి చెందిన పాపని శ్రీనివాస్ ఆదివారం వ్యవసాయ బోరు వద్దకు వెళ్లాడు. ఆయన భార్య బయటనుంచి గడియపెట్టి ఇంటి దాబాపైకి వెళ్లి పడుకున్నారు. సాయంత్రం శ్రీనివాస్ ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. లోపల చూడగా రూ.2 లక్షలు కనిపించలేదు. మంగళవారం పోలీసులు ఆధారాలు సేకరించారు. రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్‌ను వివరణ కోరగా విచారిస్తున్నామన్నారు.

రైతును బురిడీ కొట్టించిన వ్యాపారి

హత్నూర, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యాపారి ఓ రైతును మోసం చేసిన ఘటన హత్నూరలో మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు బాలయ్య తెలిపిన ప్రకారం సోమవారం ఓ యువకుడు బియ్యం కొంటారా అని ఇంటికి వచ్చాడు. కర్నూలు సన్నరకం బియ్యం చూపించి, క్వింటాకు రూ.5,600 ధర చెప్పగా 25 కేజీల అయిదు బస్తాలు కొన్నా. ఊరి బయట డీసీఎం వాహనంలో ఉన్నాయని చెప్పి ద్విచక్రవాహనం మీద అయిదు బస్తాలు తీసుకొచ్చి ఇచ్చి, నగదు తీసుకుని వెళ్లిపోయాడు. మంగళవారం బియ్యం బస్తాలు తీసి చూడగా దొడ్డు రకం కనిపించాయి. దీంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. ఒక్కో బస్తాలో అయిదు కిలోల బియ్యం తరుగు వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ప్రకృతి మలచిన పర్యాటకం



గుట్టల మధ్య మహాసముద్రం చెరువు



‘లైట్స్ ఆన్.. స్టార్ట్ కెమెరా.. యాక్షన్’ అని చిత్రీకరణ సందడి హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్‌లోని మహాసముద్రం చెరువు పరిసరాల్లో ఇటీవల చోటుచేసుకుంటోంది. చుట్టూ ఎత్తైన హరిత కొండలు, పక్షుల కిలకిలా రావాలు, వాటి మధ్య నీటిగలగలలు వెరసి ఆకట్టుకుంటోంది. సెలవు రోజుల్లో ప్రకృతి ప్రేమికులు ఇక్కడి వస్తున్నారు. లఘు చిత్రాలు, ప్రీ వెడ్డింగ్, రీల్స్ లాంటివి ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. చెరువు పక్కనే ఉన్న గుట్టను స్థావరంగా చేసుకుని సర్దార్ సర్వాయి పాపన్న ఈ ప్రాంతాన్ని గతంలో కొంత కాలం పరిపాలించారు. ఆనవాళ్లు గుట్టపై ఉన్నాయి. భైరవుడి విగ్రహం గుట్టపై ఉంది. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారు. అక్కడికి వెళ్లే రోడ్డు కొన్నిచోట్ల సరిగా లేదు. మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

ఏటీసీ.. నైపుణ్యాలకు అవకాశమిచ్చి..

ప్రభుత్వ ఐటీఐలకు మహర్దశ



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్: ఇది పోటీ ప్రపంచం. ప్రతిభ చూపితేనే అవకాశాలు సొంతమవుతాయి. నైపుణ్యాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఏర్పాటుచేసినా ఆశించిన ఫలితాలు కనిపించని పరిస్థితి. నైపుణ్యాల లేమితో కోర్సు పూర్తిచేసినా చాలా మంది విద్యార్థులు అవకాశాలు దక్కించుకోలేకపోతున్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వారే ఎక్కువ. ఐటీఐలను నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్ల (ఏటీసీ) ఏర్పాటుకు సిద్ధమైంది. తాజాగా ఈ నెల 19 వరకు గడువుతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇవీ కోర్సులు: • మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ • ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ • ఆర్టీసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ • బేసిక్ డిజైనర్ అండ్ వెరిఫైయర్ • అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ • మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్

ఆవరణలోనే కేంద్రాలు

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలన్నింటిలోనూ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు ప్రభుత్వం ఇప్పటికే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఒక్కో ఐటీఐకి రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. వీటితో నూతన భవన సముదాయాలను నిర్మిస్తున్నారు. కళాశాల ఆవరణలో 10వేల చదరపు అడుగుల స్థలంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఐదేళ్ల పాటు కోర్సు నిర్వహణ బాధ్యతలను సంస్థ చూసుకుంటుంది. కొత్త యంత్రాలు వస్తాయి. వివిధ కోర్సులతో ఐటీఐతో పాటు శిక్షణ పూర్తి చేసుకోగలుగుతారు.

విద్యార్థులకు మంచి అవకాశం:

– రాజేశ్వరరావు, ప్రిన్సిపల్, ప్రభుత్వ ఐటీఐ, సంగారెడ్డి



కోర్సుతో పాటు నైపుణ్యాల పెంపుతో మంచి అవకాశాలు ఉంటాయి. నైపుణ్య శిక్షణ పూర్తిచేసుకుంటే స్వయం ఉపాధిలోనూ రాణించేందుకు వీలుంటుంది. ఏటీసీలో ప్రవేశాలకు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: వ్యక్తి అసభ్యకరంగా వ్యవహరించాడని మనస్తాపం చెందిన మహిళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాలు... పట్టణానికి చెందిన యాదమ్మ(40) కూలీ పనులు చేసుకుంటూ ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులను పోషిస్తోంది. ఏడేళ్ల క్రితం భర్త మృతి చెందగా, గుడిసెలో ఉంటోంది. పట్టణానికి చెందిన రాములు ఆదివారం యాదమ్మ ఇంటికి వచ్చి ఆమెతో అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపంతో మంగళవారం ఉదయం తన ఇంట్లో ఉరేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు నార్సింగ్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం


శివకుమార్


వికారాబాద్, న్యూస్‌టుడే: అప్పులు పెరిగిపోయి.. తీర్చే మార్గం కానరాక పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ ఎస్సై సత్యనారాయణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన లక్కాకుల శివకుమార్(31) స్థానికంగా ఎరువులు, పురుగు మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తెలిసిన వారి నుంచి భారీగా అప్పులు చేశారు. తీర్చే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెందాడు. మంగళవారం కారులో వస్తూ వికారాబాద్ మండలం మైలార్ దేవరంపల్లి సమీపంలో రోడ్డు పక్కన ఆగాడు. వెంట తెచ్చుకున్న పురుగు మందును కారులోనే తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దారిన వెళ్లే గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. శివకుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం


అనిల్ కుమార్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన మంబోజిపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామీణ ఠాణా ఎస్సై మురళీ తెలిపిన వివరాల ప్రకారం... పాపన్నపేట మండలంలోని యూసుఫ్‌పేటకు చెందిన అనిల్ కుమార్(30) మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌తో కలిసి స్వగ్రామానికి వెళుతుండగా మంబోజిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. బాల్‌రాజ్ చికిత్స పొందుతున్నాడు. అనిల్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గేదెను ద్విచక్రవాహనం ఢీకొని..


నాగులు

చేగుంట, న్యూస్‌టుడే: ఎదురుగా వచ్చిన గేదెను ద్విచక్రవాహనం ఢీకొనటంతో ఒకరు మృతిచెందిన ఘటన చేగుంట మండలం బోనాల వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానిక ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసాన్‌పల్లికి చెందిన నాగులు(56) వ్యవసాయం చేస్తుంటాడు. శివ్వాయిపల్లిలో బంధువు అంత్యక్రియలకు తన అన్న కుమారుడు మల్లేశంతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా.. బోనాల శివారులో అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొనటంతో వెనకాల కూర్చున్న నాగులు కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


గురువారెడ్డి

తొగుట, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై తొగుట మండలం గుడికందులకు చెందిన రైతు గోరిట గురువారెడ్డి(42) మృతిచెందాడు. గ్రామస్థులు, మిరుదొడ్డి ఎస్సై పరశురాములు కథనం మేరకు.. గురవారెడ్డికి నాలుగు ఎకరాల పొలం ఉంది. ఇటీవలే మొక్కజొన్న పంట కోశాడు. మళ్లీ ఆ భూమిని పొద్దుతిరుగుడు, మొక్కజొన్న సాగు కోసం సిద్ధం చేశాడు. నీటి తడులు ఇవ్వడానికి మంగళవారం బిందుసేద్యం పరికరాలు అమరుస్తున్నాడు. ఈ క్రమంలోనే భూమిలో చేతికి అందే ఎత్తులో ఉన్న ఎల్టీ, 11 కేవీ విద్యుత్తు తీగలకు బిందుసేద్యం పరికరాలు తగిలి విద్యుదాఘాతానికి గురై గురువారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలిసి భార్య రమాదేవి, కూతురు ఆకాంక్ష, కొడుకు లోకేష్ రెడ్డి బోరున విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై వెల్లడించారు.

ఆహార వృథాకు వేద్దాం కళ్లెం



న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, గజ్వేల్:

అన్నం పరబ్రహ్మ స్వరూపం. పేదరికంలో మగ్గే ఎంతో మంది ఒక్కపూట భోజనానికైనా అలమటిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆహార వృథాను అరికట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపైనా ఉంది. ప్రతి మెతుకు.. ఇంకొకరి బతుకు కోరుతుందనే కోణంలో యోచించాలని సామాజికవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఆ దిశగా చైతన్యం రావాల్సి ఉంది. **నేడు ప్రపంచ ఆహార వృథా నివారణ దినోత్సవం సందర్భంగా** ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం.

జీవనశైలితో మార్పు

జీవనశైలి మారిన ప్రస్తుత తరుణంలో బయట లభించే ఆహారపదార్థాలను ఎక్కువగా ఆరగిస్తున్నారు. వారాంతాలు, ప్రత్యేక రోజుల్లో ఆహార కేంద్రాలు కిటకిటలాడుతున్నాయి. ఎక్కువ శాతం మంది ఆహారాన్ని వృథా చేస్తున్నారు. కొందరు నిర్వాహకులు మాత్రమే సేవాభావాన్ని చాటుతున్నారు. సరైన అవగాహన లేక కొన్ని కుటుంబాల సభ్యులు ఇంటి వద్ద ఆహారాన్ని వృథాగా పారేస్తున్నారు. పల్లెలతో పోల్చితే పట్టణాల్లో ఎక్కువ శాతం ఈ ధోరణి కనిపిస్తోంది. ఆహారం వృథా చేయకుండా దాని విలువను గుర్తించి సద్వినియోగం చేసేందుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.


గ్యాస్ ఉత్పత్తి చేసే సిద్దిపేట బుస్సాపూర్ ప్లాంటు

చైతన్యం అందరిలో రావాలి

– జోజి, సామాజిక కార్యకర్త, మాజీ సైనికుడు, సిద్దిపేట



వేడుకలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి. మెనూలో జాగ్రత్తలు తీసుకోవాలి. అనేక రకాలు వడ్డించడంతో సగం వృథాగా మారుతున్నాయి. పారబోతకు ఆస్కారం లేకుండా అవగాహన కల్పించాలి. ఇతర దేశాల్లో హోటళ్లలో అవగాహన కల్పించే సిబ్బంది ఉంటారు. అందరిలో చైతన్యం వస్తే వృథా తగ్గించొచ్చు.

• సిద్దిపేటలో వాణిజ్య సముదాయాలు 3600 వరకు కొనసాగుతున్నాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, వివిధ రకాల ఆహార తయారీ కేంద్రాల నుంచి నిత్యం 2.50 టన్నుల మేర ఆహార వ్యర్థాలను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ‘బసిల్ ఫౌండేషన్ తెలంగాణ’ సంస్థ సేకరిస్తోంది. బుస్సాపూర్‌లోని ప్లాంటుకు తరలించి గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నారు. రోజులో 1.80 క్యూబిక్ మీటర్ల గ్యాస్ వెలువడుతోంది.

• వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సిద్దిపేట నిరాశ్రయుల కేంద్రం, సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకులకు పంపిణీ చేస్తున్నారు. ఆలయాల్లో అన్నప్రసాదాల్లో మిగిలినవాటినీ కేంద్రాలకు తరలిస్తున్నారు. అన్నార్థుల ఆకలిని తీర్చడంతో పాటు వృథాకు అడ్డుకట్ట వేసినట్లవుతోంది.

• సిద్దిపేటలోని ఓ రెస్టారెంట్‌లో నిత్యం 50 కిలోలకు పైగా బిర్యానీ, ఇతరత్రా ఆహార ఉత్పత్తులు తయారీ చేసి విక్రయిస్తున్నారు. అందులో దాదాపు 8 కిలోల వరకు వృథాగా మారుతోంది. పలువురు వినియోగదారులు పూర్తిస్థాయిలో తినక అలానే వదిలిపెడుతున్నారు. కొందరు మిగిలిన ఆహారాన్ని ఇంటికి పార్సిల్ తీసుకెళ్తున్నారు. మరికొందరు యాచకులకు అందిస్తున్నారు.

ఆకలి తీర్చడమే.. శరణమయ్యప్పా..


రోడ్డు పక్కన నివసించే వారికి ఆహార పొట్లాలు ఇస్తున్న భక్తులు

రోడ్డు పక్కన రాత్రి సమయంలో ఉండే నిరాశ్రయులకు అయ్యప్ప ఆపద్బాంధవ సేవా సమితి తన వంతు చేయూత అందిస్తోంది. అయ్యప్ప దీక్ష తీసుకున్నా.. లేకున్నా.. సంగారెడ్డి జనప్రియ హోటల్ యజమాని రాజు గురుస్వామి సహకారంతో భోజన ప్యాకెట్లను అందిస్తున్నారు. హోటల్‌లో అమ్ముడు పోగా మిగిలిన తాజా ఆహార పదార్థాలను సభ్యులు ప్యాక్ చేసి కొత్త, పాత బస్టాండ్లు, జిల్లా ప్రభుత్వాసుపత్రి ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసిస్తున్న వారికి అందిస్తున్నారు. ఆకలి తీర్చడాన్ని ఆధ్యాత్మిక సేవగా భావిస్తున్నామన్నారు.

ఇలా చేద్దాం

• ఆహారాన్ని పారేయకుండా ఇతరులకు ఇచ్చే అలవాటు చేసుకోవాలి.
• స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు సామాజిక బాధ్యత నిర్వర్తించాలి.
• పాఠశాలలు, వసతిగృహాల్లో వృథా అవుతోంది. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి.
• వేడుకల్లో భోజనాల అంచనా ముందుచూపుతో ఉండాలి.
• పోషకాల రేషన్ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

బైకు సీటు కింద పాము.. తప్పిన ముప్పు



దోమ, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని ఓ వ్యక్తి మెకానిక్ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ బండి సీటులోంచి నాగుపాము బయటికి రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. దోమ మండలం బుద్లాపూర్‌లోని ఈ ఘటన చోటు చేసుకుంది. నరేష్‌కు స్థానికంగా బైక్ మెకానిక్ షాపు ఉంది. మంగళవారం ఓ వ్యక్తి తన బైక్ నడవడం లేదని ఆయన దగ్గరకు తీసుకువెళ్లాడు. బైక్‌సీటు తొలగించే క్రమంలో నరేష్‌కు సీటుకింద నాగుపాము కన్పించింది. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి వెనక్కి తప్పుకొన్నాడు. సరిగ్గా అదే సమయంలో కుల్కచర్ల మండలానికి చెందిన శ్రీనివాస్ వెళ్తున్నాడు. అతడిని పాములు పట్టే అలవాటుంది. పది నిమిషాలు శ్రమించి దాన్ని బయటకు తీశారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 126–00	డ్రెస్డ్ 215–00
రిటైల్ 148–00	స్కిన్‌లెస్ 244–00

బాధిత కుటుంబానికి స్పీకర్ పరామర్శ

మోమిన్‌పేట: సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందిన నవాబ్‌పేట సంతోష్‌రెడ్డి కుటుంబ సభ్యులను శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. హైదరాబాద్‌లో ఉంటున్న సంతోష్‌రెడ్డి దసరా పండగ కోసం స్వగ్రామం వచ్చాడు. రాత్రి ఛాతీలో నొప్పి రావడంతో చికిత్స అందించేందుకు కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా.. దారిలో మృతి చెందాడు. విద్యాశాఖ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి భారాస జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ చీమలదరికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కలాం సేవలు మరువలేనివి

వికారాబాద్ మున్సిపాలిటీ: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు మరువలేమని పుర అధ్యక్షురాలు మంజుల అన్నారు. మంగళవారం ఆయన జయంతి సందర్భంగా పురపాలక కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


అన్న ప్రసాదం వితరణ

తాండూరు టౌన్: తాండూరు నుంచి తుల్జాపూర్‌కు బయలు దేరిని యాత్రికులకు హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం అన్న ప్రసాదం వితరణ చేశారు. భవానీమాత దర్శనానికి వెళ్తున్న భక్తులకు రైల్వేస్టేషన్‌లో సమితి ప్రతినిధులు ప్రసాదం అందజేశారు. ఉత్సవ సమితి కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, తాటికొండ పరిమళ్, కౌన్సిలరు రామకృష్ణ, అశోక్, పరమేశ్వర్, శ్రీధర్, నర్సింహులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్





నౌకాదళ ప్రధాన అధికారి త్రిపాఠి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్

దారులన్నీ దామగుండానికే..

రాడార్ స్టేషన్ శంకుస్థాపన సందర్భంగా పలువురిని పోలీసులు సోమవారం, మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. వివిధ ఠాణాలకు తరలించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఏర్పాటు చేయడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. పరిగి, కుల్కచర్ల, పూడూరు మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్, భాజపా నాయకులు కార్యక్రమానికి హాజరయ్యారు.

– న్యూస్‌టుడే, పూడూరు, పరిగి, వికారాబాద్, వికారాబాద్ మున్సిపాలిటీ, కుల్కచర్ల

- పరిగి నుంచి మండల కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఒకరోజు ముందుగానే జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.
- భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూనేటి మారుతి కిరణ్ కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిశారు.
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, శాసన మండలి విప్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ స్వప్న కేంద్ర మంత్రిని, ముఖ్యమంత్రిని కలిశారు.



కుల్కచర్ల ఠాణా వద్ద భారాస నాయకుల నిరసన

ఆంక్షలు సరికాదు..

- దామగుండంలో నేవీ శంకుస్థాపన జరిగే ప్రదేశానికి వెళ్లకుండా ఎస్సై మధుసూదన్‌రెడ్డి, ఏఎస్సై పెంటయ్యల ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు.
- పూడూరు నుంచి దామగుండం సభా స్థలికివెళ్లే దారిలో మూడు చోట్ల పికెటింగ్ ఏర్పాటు చేశారు.
- ముందస్తు అరెస్టులు సరికాదని కుల్కచర్ల మండల మాజీ రైతు బంధు మండల అధ్యక్షుడు రాజు అన్నారు.
- ప్రజా సంఘాల నాయకులను సోమవారం రాత్రి నుంచి అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని జేఏసీ (దామగుండం అడవి పరిరక్షణ వేదిక) నాయకులు గీత, వెంకటేశ్వర్లు, మహిపాల్, ఆనంద్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు.
- పూడూరు మండల మాజీ ఎంపీపీ మల్లేశం, దామగుండం పరిరక్షణ కమిటీ ఛైర్మన్ దేవనోనిగూడ వెంకటయ్య, మాజీ సర్పంచి బుచ్చన్న, లక్ష్మం సత్యనారాయణ, పూడూరు భారాస గ్రామ కమిటీ అధ్యక్షుడు రామచంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మయ్య, సతీష్ పంతులు తదితరులను ఉదయాన్నే అదుపులోకి తీసుకున్నారు.
- శంకుస్థాపన వద్దకు వెళ్లకుండా కట్టడి చేయడం సరి కాదని పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం, పరిగి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుల్కచర్ల మండల పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి అన్నారు.

సీఎంను కలిసిన పుర అధ్యక్షురాలు

వికారాబాద్ మున్సిపాలిటీ: సీం రేవంత్‌రెడ్డికి వికారాబాద్ పుర అధ్యక్షురాలు మంగళవారం మంజుల-రమేశ్‌కుమార్ దంపతులు దసరా శుభాకాంక్షలు తెలిపారు. దామగుండం వద్ద నేవీ రాడార్ స్టేషన్‌ను ప్రారంభించటానికి సీఎం విచ్చేసిన సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే టీఆర్ఆర్‌ల సమక్షంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారిని సీఎం ఆప్యాయంగా పలకరించారు.



రోడ్ల అభివృద్ధికి రూ.20కోట్లు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి నియోజకవర్గంలో 22.20 కిలోమీటర్ల దూరం రోడ్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.20కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80085 73260
పరిగి : 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, మోమిన్‌పేట, కుల్కచర్ల గ్రామీణ, మర్పల్లి, దోమ:

? ప్రయాణ ప్రాంగణాలలో ఇష్టానుసారంగా నిలుపుతున్న వాహనాల వల్ల బస్సుల రాకపోకలతో పాటు, ప్రయాణికులకు పలు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. – **బ్రహ్మానందరెడ్డి, ప్రయాణికుడు, మోమిన్‌పేట**

✓ ఇబ్బందులను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. –స్వప్న, కార్యదర్శి మోమిన్‌పేట

? బీసీ కాలనీలో అంతర్గత మురుగు కాలువలు లేక నీరు రోడ్లపైకి వస్తుంది. కాలువలు నిర్మించి సమస్య పరిష్కరించండి. – **రాములు, కల్కొడ**

✓ కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. – **రాజమల్లయ్య, ఎంపిడీవో, మర్పల్లి**

? బండవెల్కిచర్ల ఎస్సీ కాలనీలో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ఇళ్ల మధ్యన ట్యాంకు ఉంటడంతో కూలితే ప్రమాదం జరగడానికి అవకాశం ఉంది. –**రమేష్, స్థానికుడు**

✓ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందనేది వాస్తవమే. మండల అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి.. వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూస్తాం. – **ఖాజాపాష, పంచాయతీ కార్యదర్శి.**

? దోమ మండలం పాలేపల్లిలో సీసీ పక్కన గుంతలు పడి ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. – **నర్సింలు, పాలేపల్లి**

✓ పరిశీలించి గ్రామపంచాయతీ నుంచి తాత్కాలిక మరమ్మతు చేయడానికి కృషి చేస్తాం. – **సంతోష, కార్యదర్శి పాలేపల్లి.**

జాతీయ రహదారిపై మొరాయించిన లారీ



తాండూరు టౌన్, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ నుంచి తాండూరు మీదుగా కర్ణాటక వరకు రూ. 840 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న 167 జాతీయ రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. వర్షాలు కురుస్తుండటంతో పనులకు మరింత అంతరాయం ఏర్పడుతోంది. ఆ మార్గంలో ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలు ప్రతి రోజు వేల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ ఉన్న సిమెంటు, నాపరాతి, సుద్ద, ముడి సరకును ఇతర ప్రాంతాలకు తరలించటానికి లారీలు వెళ్తుంటాయి. ఇలా లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ మంగళవారం జాతీయ రహదారి మధ్యలో నిలిచి పోయింది.

పశువులకు గాలికుంటు టీకాలు

కొడంగల్: పశువులకు గాలికుంటు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా టీకాలు వేయడం జరుగుతుందని జిల్లా పశువైద్యాధికారి సదానందం అన్నారు. మంగళవారం పశువైద్యశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో 'కడా' ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆవులు పాల ఉత్పత్తి తగ్గిస్తాయని అందుకోసం ముందస్తు జాగ్రత్తగా ఈ టీకాలను వేయించాలని సూచించారు. రైతులు ప్రతి ఒక్కరు వారి పశువులకు గాలికుంటు టీకాలు కచ్చితంగా వేయించాలని తెలిపారు. పశువైద్యులు డాక్టర్. నోవ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: పట్టపగలే మండల కేంద్రంలో వీధి దీపాలు వెలుగుతున్నాయి. రాత్రి వాటిని వెలిగించిన తరువాత ఉదయం వాటిని మలపడం లేదు. మెట్లకుంటకు వెళ్లే రోడ్డుకు పక్కన వెలసిన కొత్త కాలనీలో స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వాటికి ఆన్‌ఆఫ్ చేసే సౌకర్యం లేక నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల గ్రామ పంచాయతీకి విద్యుత్తు బిల్లులు భారంగా మారనున్నాయి.

బాబోయ్.. పొలాల దారి




ధారూర్, న్యూస్‌టుడే: కుక్కింద గ్రామ శివారులో పంట పొలాలకు వెళ్లేదారి ఇది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకి పూర్తిగా బురద మయంగా మారింది. రైతులు పంట పొలాలకు వెళ్లడానికి నిత్యం అవస్థలు పడుతున్నారు. పంట ఉత్పత్తులు తీసుకురావాలంటే బురదలోంచి రావలసి వస్తుందని వాపోతున్నారు. అధికారులు ఈ దారిలో మొరం పోయించి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సూచికలు లేక ప్రమాదాలు



దోమ, న్యూస్‌టుడే: గ్రామాల దగ్గర సూచికలు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిగి-కోస్గీ ప్రధాన రోడ్డు దోమ మండలం ఐనాపూర్ మధ్య ఉన్న మూల మలుపు అంత్యంత ప్రమాదకరంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. దాదాపూర్, కొత్తపల్లి, గుండాల్, మల్లేపల్లి మండల కేంద్రం రావడానికి ఇదే దారి దిక్కు. నగరానికి వెల్లడానికి గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, జిన్నారం, రంగారెడ్డిపల్లి, కోస్గీ, నారాయణపేట ప్రాంతాల నుంచి ఈ దారిగుండానే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళ మరింత ప్రమాదకరంగా ఉంటుంది. సూచికలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దారి పక్కనే.. నియంత్రిక



కొడంగల్, న్యూస్‌టుడే: కోస్గి రోడ్డు నుంచి బాపల్లికి వెళ్లేదారిలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. రోడ్డు పక్కన డ్రైనేజీ నిర్మాణం చేస్తుండగా మధ్యలో వచ్చింది. దాన్ని తొలగించాలని పలుమార్లు వినతులు అందించినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దాదాపు మూడు సంవత్సరాలుగా ఈ పనులు పెండింగ్‌లో ఉన్నా.. దృష్టి సారించడం లేదని పలువురు కాలనీ వాసులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రయోజనం

కుల్కచర్ల, న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక చింతన మేలు చేస్తుందని ఆర్ఎస్ఎస్ బాధ్యుడు ప్రేమ్‌ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్మిస్తున్న శివాలయానికి రూ. 51 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక వీరశైవ సమాజం నాయకులు చంద్రప్రకాష్, కాశయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచి

యాలాల, న్యూస్‌టుడే: హాజీపూర్ మాజీ సర్పంచి ఒంగోనిబాయి శ్రీనివాస్ యాలాల మండల కాంగ్రెస్ నాయకుడు బెన్నూర్ వికాస్ ఆధ్వర్యంలో మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలోలో కాంగ్రెస్‌లో చేరారు. హాజీపూర్ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేహామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

మోమిన్‌పేట, న్యూస్‌టుడే: సైబర్ నేరాల విషయంలో అంతా అప్రమత్తంగా ఉండడం ముఖ్యమని ఏఎస్సై పుండరీకం సూచించారు. ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికులకు సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించి మాట్లాడారు. బహుమతులు, రుణాలు లభించేందుకు అర్హత పొందారని చరవాణులకు వచ్చే కాల్స్ లింకులను నొక్కరాదన్నారు.

సర్కారు బడుల్లో.. కీలక పోస్టుల భర్తీ

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని రెండు ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం కొత్తగా 10 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేసింది. రేగడిమైలారం మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలుగు, ఆంగ్లం, గణితం, ఫిజికల్ సైన్స్, సాంఘిక శాస్త్రం ఇలా అన్ని విషయాలకు ఒక్కో ఎస్ఏ పోస్టును, దుద్యాల మండలంలోని చిల్‌ముల్‌మైలారం మండల పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలుగు, ఆంగ్లం, గణితం, జీవ శాస్త్రం, సాంఘికశాస్త్రం పోస్టులను మంజూరు చేసింది. మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ కౌన్సెలింగ్‌లో ఖాళీలుగా అధికారులు చూపించారు. ఇంతకు ముందు ఈ రెండు పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు లేక విద్యా బోధన కుంటుపడింది. ఆయా సబ్జెక్టులను ఎస్జీటీలే బోధించడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. రెండు పాఠశాలలకు పోస్టులు మంజూరు చేసి భర్తీ చేస్తుండటం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుద్యాల: ప్రస్తుతం కొనసాగుతున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో అదనంగా ఉపాధ్యాయపోస్టులు పెంచి భర్తీ చేయడం హర్షణీయమని దుద్యాల మండల తపస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శంకరప్ప, తేజస్విని అన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలోని ఈర్లపల్లి, బోడబండతండా, మేడిచెట్టు తండా, రోటిబండతండా, లగచెర్ల గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో వెంకన్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూరి చేయాలని సూచించారు.

యార్డుల్లో సమస్యల తిష్ఠ

● ఇబ్బందుల్లో అన్నదాతలు

న్యూస్‌టుడే, పరిగి, వికారాబాద్ కలెక్టరేట్:

అన్నదాతలు రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఉత్పత్తుల అమ్మకాలతో మార్కెట్ కమిటీలకు ఆదాయం అందుతున్నా.. విపణిలో మౌలిక సదుపాయాల కల్పన ఎండమావిగానే మారింది. ప్రధానంగా అంతర్గత రోడ్లు, విద్యుద్దీకరణ పనులు, రైతు విశ్రాంతి భవనాల ఏర్పాటులో విపరీత జాప్యం జరుగుతోందని పరిగి, వికారాబాద్ ప్రాంత రైతులు వాపోతున్నారు.

రూ.కోట్లలో ఆదాయం

పరిగిలో మార్కెట్ దినదినాభివృద్ధి చెందుతోంది. సుమారు పన్నెండెకరాల విస్తీర్ణంలో ఉండగా దాదాపు 56 మంది కమీషన్ ఏజెంట్లు, 14మంది కొనుగోలు దారులు ఉన్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం లక్ష్యం రూ. 1.14కోట్లు ఉండగా రూ. 1.19 కోట్లు ఆర్జించింది. ఇదే క్రమంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.6కోట్లు ఉండగా రూ. 2.04కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.78కోట్లు లక్ష్యంగా ఉండగా రూ. 1.49 కోట్లు, 2024-25కి గాను రూ. 3.70కోట్లు ఆర్జించాలని ఉండగా ఇప్పటివరకు రూ. 2.5కోట్ల మేరకు ఆదాయం సమకూరింది. గంజ్‌రోడ్డుపై సుమారు రూ. 1.5కోట్ల అంచనా వ్యయంతో పూర్తిచేసిన 15దుకాణాలను ఇటీవల ప్రారంభించడంతో అదనపు ఆదాయ వనరులు అందుతున్నాయి.

వసతులు కల్పిస్తే..

- యార్డులో సౌకర్యాలు కల్పిస్తే మరింత అభివృద్ధి చెందనుంది.
- పరిగిలోని యార్డుకు పరిగితో పాటు బొంరాస్‌పేట, ధారూర్, దోమ, పూడూరు మండలాలకు చెందిన రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఇక్కడకు తీసుకువస్తుంటారు.



పరిగిలో పనిచేయని వే బ్రిడ్జి



పరిగి యార్డులో అపరిశుభ్రత

- ప్రతి శుక్రవారం స్థానికంగా యార్డు జరుగుతోంది.
- చినుకు పడితే చాలు యార్డుకు ధాన్యం తీసుకు వచ్చిన రైతుల వెన్నులో వణుకు పుడుతోంది.
- కవర్ షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.
- వర్షం నుంచి రక్షించుకునేందుకు పడపాట్లు అన్నీ ఇన్నీకావు. ధాన్యం ఆరబోసుకునేందుకు డ్రైయింగ్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.
- యార్డు మొత్తంగా సిమెంటు రోడ్లను ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనం.

వికారాబాద్‌లో..

జిల్లా కేంద్రం మార్కెట్ యార్డు బురదమయంగా మారింది. పారిశుద్ధ్య లోపంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం రూ. 4కోట్లు ఉండగా ఇప్పటివరకు సుమారు 25శాతం సమకూరింది. పశువుల మార్కెట్ కూడా ఇక్కడే జరగడంతో రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

చేవెళ్ల: బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఈవో నరేందర్ తెలిపారు. 20 రోజుల్లోపు సహాయ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమస్యల చింత లేదింక

అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు జిల్లాకు రూ. 1.28 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వసతులను కల్పిస్తున్నారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న కేంద్రాల్లో కాకుండా సొంత భవనాల్లో వీటిని కల్పిస్తున్నారు.

1,107 అంగన్‌వాడీ కేంద్రాలు

వికారాబాద్ జిల్లాలో కొడంగల్, మర్పల్లి, పరిగి, తాండూరు, వికారాబాద్‌లలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మూడేళ్లలోపు చిన్నారులు 33,157 మంది, 3 నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న చిన్నారులు 19,655 మంది ఉండగా, 6121 మంది గర్భిణులు, 5359 మంది బాలింతలు ఉన్నారు. 477 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, పాఠశాల భవనాలు, కమ్యూనిటీ భవనాలు తదితర అద్దెలేకుండా ఉన్న కేంద్రాలు 439 ఉన్నాయి. మిగతా 191 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 670 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. మంజూరు చేసిన నిధుల నుంచి ఇప్పటి వరకు రూ. 1.24 కోట్లు ఖర్చు చేశారు.



బొంరాస్‌పేటలో కేంద్రానికి రంగులు

కల్పించిన వసతులు ఇవీ

- ఒక్కో అంగన్‌వాడీ కేంద్రంలో రూ. 1,635 లతో ఒక ఫ్యాను, ఒక ట్యూబ్‌లైటు ఏర్పాటు చేస్తున్నారు.
- అంగన్‌వాడీ భవనానికి రంగులు వేయడానికి, నామఫలకం రాయించడానికి రూ. 8 వేలు కేటాయించారు. గోడలపై చిన్నారులను ఆకర్షించేలా రూ. 2 వేలతో బొమ్మలు వేస్తారు.
- చిన్నారులకు పోషకాహారం వండడానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ ప్లాట్‌ఫాంలు లేవు. గ్యాస్ పొయ్యిని కింద పెట్టి ఆయాలు వంటలు చేస్తున్నారు. ఇది ప్రమాదమని గుర్తించిన అధికారులు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ ప్లాట్‌ఫాం నిర్మాణానికి రూ. 7 వేలు మంజూరు చేశారు.
- అంగన్‌వాడీ కేంద్రాలకు ఉన్న కిటికీలకు తలుపులు లేకపోవడంతో పిల్లులు, ఎలుకలు వచ్చి చిన్నారులకు ఉంచిన గుడ్లు తింటున్నాయి. దీనిని నివారించడానికి కిటికీలకు మెష్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పిస్తున్నాం..

–కృష్ణవేణి, జిల్లా సంక్షేమాధికారి

జిల్లాలోని 670 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ. 1.28 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు రూ. 1.24 కోట్లు ఖర్చు చేసి వసతులు కల్పించాం. కేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయడం వల్ల చిన్నారులకు ఎండా కాలంలో వేసవి తాపం నుంచి ఉపశమనం కలుగుతుంది. కిటికీలకు మెష్ ఏర్పాటు చేయడం వల్ల బయట నుంచి ఏమీ రాకుండా ఉంటాయి.

18న ప్రమాణ స్వీకారం

కొడంగల్: నూతన మార్కెటు కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు సాగుతున్నాయి. మంగళవారం పాలక మండలికి చెందిన సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ నెల 18న కార్యక్రమం నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నారని మార్కెటు సభ్యులు తెలిపారు.



సమావేశమైన ఎంపికైన సభ్యులు

భక్తిశ్రద్ధలతో యజ్ఞ మహోత్సవం



అంతారంలో భక్తులు

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: అంతారంలో యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు చిన్నయ్య, సాయన్న, వెంకట్ రాములు ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి, శివలింగం, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం యజ్ఞం నిర్వహించారు.

హోటల్ యజమానిని బెదిరించిన వ్యక్తి రిమాండ్

చేవెళ్ల గ్రామీణం: హోటల్ యజమానిని బెదిరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి వివరాల ప్రకారం... చేవెళ్లలోని షాబాద్ చౌరస్తాలో ఉన్న ఎంజీ కోర్ట్ హోటల్‌లో బుర్ర రాములు భోజనం చేసి పలుసార్లు డబ్బులు ఇవ్వలేదు. సోమవారం రాత్రి 10 గంటలకు డబ్బులివ్వకుండా భోజనం టోకన్ ఇవ్వాలని హోటల్ యజమాని సయ్యద్ ఉమర్‌ను అడిగాడు. పాత బాకీ ఇస్తే తప్ప టోకన్ ఇవ్వనని చెప్పడంతో రాములు బెదిరించాడు. భయపడిన హోటల్ యజమాని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడి అనుమానాస్పద మృతి

మొయినాబాద్: పంట పొలంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగిరెడ్డిగూడకు చెందిన గౌరెల్లి ప్రశాంత్(25) మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తల్లి సైతం మృతి చెందింది. దీంతో మద్యానికి బానిసైన ప్రశాంత్ మంగళవారం మధ్యాహ్నం తల్లి సమాధి వద్దకు వెళ్లి వస్తుండగా వరి పొలంలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఊపిరాడక ఆయన మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.